అద్భుతమైన అతడి మెదడుని పరిశోధించిన శాస్త్రజ్ఞులకి తెలిసిందేమిటి?

రహస్యం

అతడి మెదడుకోసం వాళ్లంతా వలపన్నారంటే అతిశయోక్తి కాదేమో? అతడో అపరిమిత మేధావి. ఏ విషయాన్నైనా నిమిషాల మీద తేల్చేయగలడు. అతడి ముందు ప్రపంచ మేధావులంతా తలలు వంచాల్సిందే! గణితంలో చాణిక్యుడికంటే పదింతలు తలముదిరినవాడు. అతడి మెదడు కదలికలకు ఏ దేశ కంప్యూటర్లూ సరితూగడంలేదు. అలాంటి అతడి రాకకోసం వాళ్లంతా ఎదురు చూస్తున్నారు. అందరిలోనూ ఎంతో ఆసక్తత నిండి వుంది. కాన్వరెన్స్ హాల్ డాక్టర్లు, శాస్త్రవేత్తలతోనూ, రాజకీయ ప్రముఖులతోనూ నిండి వుంది. ప్రధానమంత్రి సైతం అతని రాకకోసం వేచి వున్నాడు. సరిగ్గా పదిగంటలవుతుండగా కాన్వరెన్స్ హాల్‌ముందు ఆగిందో కారు. దానిలోనుండి దిగాడు ప్రపంచం గర్వించదగ్గ నారాయణన్. ఎనభై సంవత్సరాలు నిండిన శరీరం. ముడతలుపడ్డ మదురు. నెరిసిన జుట్టు హుందాగా నడుచుకుంటూ లోనికెళ్లాడు. అతడ్ని చూసి స్నేహపూర్వకంగా విష్‌చేశారందరూ. ప్రధానమంత్రి నారాయణన్‌ని తన ప్రక్క సీట్లో కూర్చోబెట్టాడు. అప్పుడు మొదలైంది మీటింగ్. ఎన్నడూ కనీవినీ ఎరుగని వింత చర్చ. విజ్ఞానాన్ని ఇనుమడింపజేసే తపన. నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ జయదేవ్ లేచాడు. అంతా అతనివైపు తలలు తిప్పారు. హాలంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ డాక్టర్ జయదేవ్ కంఠం ఖంగుమంది... "మైడియర్ ఫ్రెండ్స్... మనమంతా సమావేశమైన ఈ తరుణంలో మీ అందరికీ

నా అభివందనలు నేడు జరిగే మన సమావేశం సఫలీకృతమై భవిష్యత్‌లో అది విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. చరిత్రలో ఎక్కడా కనీ వినీ ఎరుగని కార్యాన్ని మనం రూపొందించబోతున్నాం. మనం చేయబోయే మహత్తర కార్యానికి మన ప్రధానిగారు ఒప్పుకుని మన చర్చల్లోపాల్గొనడం మన అదృష్టం'' చెప్పడం ఆగి ఊపిరి

పీల్చుకున్నాడు జయదేవ్. "ఇంతకీ విషయం ఏమిటి" చైర్‌లోనుండి ముందుకువంగుతూ అన్నాడు నారాయణన్.

"ఆ విషయాన్నే ప్రస్తావించబోతున్నాను మిస్టర్ నారాయణన్... ప్లీజ్ జస్ట్ వెయిట్" అన్నాడు నవ్వుతూ జయదేవ్. బదులుగా నారాయణన్ చిరునవ్వునవ్వాడు.

జయదేవ్ గొంతు సవరించుకుని మొదలెట్టాడు మళ్లీ "ప్రపంచ మేధావులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తగలిగినవాడూ... ప్రపంచంలో ఏ మేధావి అంచనాలకూ దొరకనివాడూ... ప్రపంచ మేధావులందరినీ అన్ని రంగాల్లోనూ ఓడించగల అసమాన ప్రజ్ఞావంతుడు మన నారాయణన్‌గారు. అలాంటి అపరిమిత మేధావి... ఏకసంధాగ్రాహి మన దేశంలో పుట్టడం మనకందరికీ ఎంతో గర్వకారణం. ప్రతి మనిషికీ మెదడు వుంటుంది. అది ఆలోచిస్తుంది... ప్రేరేపిస్తుంది... మనిషియొక్క జీవన గమనాన్ని నిర్దేశిస్తుంది. అయితే ఒక్కో మనిషి ఆలోచనా విధానం ఒక్కోలా వుంటుంది. ఆ మార్పువల్లనే మానవులు ఇంతగా అభివృద్ధి చెందారు. బట్టలు తయారుచేశారు. వాహనాలను రూపొందించారు. తమ అవసరాలకు ఉపయోగపడడానికి అన్నివిధాలైన కృత్రిమ పరికరాల్ని పరిసరాల్ని సృష్టించుకున్నారు... వీటన్నిటికీ కారణం ఏమిటి? మెదడు. ఈ ఆలోచనాపరిధి మామూలు మనిషికంటే... మనందరికంటే... ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోని అతిరథ మహారథులైన ఎందరో మేధావులకంటేకూడా మన నారాయణన్‌గారికి ఎన్నోరెట్లు ఎక్కువగా వుంది. మామూలు మనిషి మెదడులో ఆలోచనకీ నారాయణన్‌గారి మెదడు ఆలోచనలకీ తేడా ఎందుకుంది? ఆ మెదడు యొక్క రహస్యం ఏమిటి? అదే... అదేమిటో మనం కనుక్కోవాలి. ఈరోజు మనం వుంటాం. రేపు... కాలంతోపాటు మనందరం మట్టిలో కలసిపోతాం. ఈ లోపు మనం ఒక సాహసం చేయాలి. నారాయణన్‌గారి మెదడులో వున్న రహస్యమేదో మనం శోధించాలి. అందుకుగాను నారాయణన్‌గారు ఒప్పుకుని ప్రగతి పథంలో మరో నూతన అధ్యాయానికి నాంది పలుకుతారని ఆశిస్తాను" చెప్పడం ముగించాడు డాక్టర్ జయదేవ్.

అందరూ నారాయణన్‌వైపు తలలు తిప్పారు. ఏం చెబుతాడో? అని. అసలు ఈ ప్రతిపాదనకు ఒప్పుకుంటాడా? ఒప్పుకోకుండా చేసేదేముంది? అందరి మనసుల్లోనూ అదే ఆలోచన కొనసాగుతుంది. అందరూ కుతూహలంగా చూస్తున్నారు జవాబుకోసం. నారాయణన్ కళ్లు మూసుకున్నాడు. అరనిమిషం తర్వాత కళ్లుతెరిచి "నా మెదడును పరిశోధించాలంటే ముందు నేను మరణించాలి... తర్వాతనేకదా" అన్నాడు.

జయదేవ్ అవునన్నట్లు తల ఊపాడు.

"ఓకే. మీ ప్రయత్నాలు మీరు చేసుకోండి. నాకేం అభ్యంతరం లేదు" అంటూ వెనక్కివాలి రిలాక్స్‌గా కళ్లు మూసుకున్నాడు నారాయణన్.

అందరి మొహాల్లోనూ సంతోషం వెల్లివిరిసింది. ప్రధాని డాక్టర్ జయదేవ్‌వైపు చూశాడు.

జయదేవ్ చిరునవ్వు నవ్వి అందరివైపు తిరిగి "అన్ని అవయవాల పుట్టుపూర్వోత్తరాలగురించి తెలిసిన డాక్టర్లందరూ మనలో

వున్నారు. అంతా సిద్ధంకండి. ఈ అసాధ్యం అయిన పనిని చిత్తశుద్ధితో సుసాధ్యం చేయడానికి కృషిచేద్దాం. రేపు నారాయణన్‌గారి అవయవాల పరిస్థితిని మనం అంచనా వేయబోతున్నాం. గుండె కదలికలద్వారా అది ఎంతకాలం జీవిస్తుందో సుమారుగా అయినా కనుక్కుందాం'' అన్నాడు.

అంతలోనే ''అవసరంలేదు'' అన్నాడు నారాయణన్ గంభీరంగా.

అందరూ నిర్ఘాంతపోయారు.

''ఏవిధమైన పరీక్షలూ నాకవసరంలేదు. అలాగని నా మాటల్ని వేరేగా భావించకండి. నాపై నమ్మకంతో నేనీ మాట అంటున్నాను. పది... పది నిమిషాల్లోగా నా మరణసమయాన్ని నేనే మీకు తెలియజేస్తాను. ఓకే'' అంటూ అందరివైపు తిరిగి మళ్లీ ఆలోచనలో పడ్డట్లుగా కళ్లు మూసుకున్నాడు నారాయణన్. అతని మాటలకు అక్కడున్న అందరూ విభ్రాంతులయ్యారు. అదెలా సాధ్యం. వినడానికే నమ్మశక్యంగా లేదు. ఓ మనిషి తన మరణసమయాన్ని తనే తెలుసుకోవడం... అదీ పది నిమిషాల్లో... ఓహ్... ఇంపాజిబుల్. అందరూ అలాగే ఆలోచిస్తున్నారు. అయితే అసాధ్యాలను సుసాధ్యం చేయగల అనితరసాధ్యుడు నారాయణన్ అని అక్కడున్న అందరికీ తెలుసు. అందరూ అతనివైపు ఓ అద్భుతాన్ని చూస్తున్నట్లు చూస్తున్నారు. కాన్ఫరెన్స్‌హాల్ మొత్తం చీమ చిటుక్కుమన్నా విన్పించేటంతటి నిశ్శబ్దం ఆవరించింది. నిమిషం... రెండు... మూడు... ఎవ్వరూ నోరు విప్పలేదు. ఏ అవయవాన్నీ కదపకుండా శిలావిగ్రహాల్లా వున్నారు. నారాయణన్ మెదడు కంప్యూటర్‌కంటే వేగంగా తన గుండె కదలికల్ని పసిగట్టి లెక్కలు వేస్తుంది. అతనిప్పుడో మనిషికాదు. ఆలోచనల యంత్రం. అతనికి ప్పుడీలోకంతో పనిలేదు. తను నెరవేర్చబోయే గమ్యం తప్ప. ప్రధాని రెప్పవేయకుండా అతనివైపే చూస్తున్నాడు. కరెక్ట్‌గా పది నిమిషాలకు కళ్లు తెరిచాడునారాయణన్.

అంతా తన జడ్జిమెంట్‌కోసమే ఎదురుచూస్తుంటే నారాయణన్ కంఠం కాన్ఫరెన్స్ హాల్లో జంఝామారుతంలా ధ్వనించింది. "నా గుండె సరిగ్గా ఇంకా మూడు నెలల ఇరవై రెండురోజులు పనిచేస్తుంది"

ఎవరికీ నోట మాటరాలేదు. తన మరణసమయాన్ని తనే చెప్పడం ఓ వింత యితే అలాంటిదీ ఏ చింతా లేకుండా మూడు నెలల్లో తను మరణించబోతున్నాన ని ధీమాగా పలికిన అతడ్ని చూసి గాలి స్తంభించిపోయింది.

○ ● ○

నారాయణన్ గుండె బలహీనంగా కొట్టు కుంటోంది. ఇంకా కొద్ది గంటల్లోనో... నిమిషాల్లోనో అతని జీవం ఆగిపోవచ్చు. సరిగ్గా అతడు చెప్పిన మూడు నెలల ఇరవై రెండవ రోజది. నేషనల్‌గా ప్రఖ్యాతిచెందిన హాస్పిటల్లో ఇంటెన్సివ్ కేర్‌లో వుంచబడ్డా డు నారాయణన్. ప్రపంచ పత్రికలన్నిండా అతని వార్తలే. దేశ ప్రజానీకం అంతా అతను బ్రతకాలని ప్రార్థిస్తున్నారు. మరణి స్తాడని తెలిసినాకూడా. రేడియో, టి.విలు నిమిష నిమిషానికీ అతని ఆరోగ్యపరిస్థితిని జనానికి తెలియజేస్తున్నాయి. ఒక మేధావిని కోల్పోతున్నామన్న ఫీలింగ్ గుండెల్ని తొలిచే స్తుంది. నారాయణన్ మెదడుని పరిశోధించ డానికి పలు దేశాలనుండి సీనియర్ డాక్టర్లు వచ్చి సిద్ధంగా వున్నారు. ఉదయం పదకొం డు గంటలవుతుండగా కనులు తెరిచాడు నారాయణన్. ప్రక్కనే వున్న డాక్టర్లందరూ ఆశ్చర్యపోయారు జయదేవ్‌తో సహా. మూ తబడి వున్న కనురెప్పలు శాశ్వతంగా మూసు కుపోతాయని భావించారు వాళ్లంతా. కనులు తెరిచిన నారాయణన్ వాళ్లందరినీ చూసి చిరునవ్వు నవ్వాడు. ఇంకా కొద్ది క్షణాల్లో మరణించబోతున్నాడని తెలిసీ ఎలా నవ్వగలు గుతున్నాడితడు... అనుకుంటున్నారంతా.

అందరూ ఆశ్చర్యంలో వుండగానే నారా యణన్ పెదవి విప్పాడు "డాక్టర్స్... నేనింకా కొద్దిసేపు మాత్రమే జీవిస్తాను. నేను చనిపోయేముందు మీకో పని అప్పజెబు తున్నాను" అంటూ ప్రక్కనే వున్న పుస్తకం లోంచి ఓ పాడుగాటి కవర్ తీశాడు. "ఈ కవర్‌ని నేను చనిపోయాక... నా మెదడుని పూర్తిగా పరిశోధించాక మాత్రమే దీన్ని తెరిచి చూడండి" అన్నాడు నారాయణన్.

డాక్టర్ జయదేవ్ కవరందుకున్నాడు. అప్పటికే నారాయణన్ కనులు మూసుకుపో యాయి. చేయి క్రిందికి వాలిపోయింది. ప్రపంచంలో ఉన్న మేధస్సునంతా తనలోనే ఇముడ్చుకున్న నారాయణన్ ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఆ వార్త వెంటనే బయటకు వ్యాపించింది. బిబిసిలో వార్త విన్నవాళ్లంతా విషాదాన్ని గుండెల్లో నింపుకున్నారు. ప్రపం చ దేశాధినేతలంతా అతనికి నివాళులర్పించా రు. టి.విలు, రేడియోలు గగ్గోలెత్తాయి. నారాయణన్ ఇచ్చిన కవరు మాత్రం డాక్టర్ జయదేవ్ చేతిలో వుంది. దాంట్లో ఏముం దో అని అందరి మనసుల్లోనూ ఆత్రుతగా వుంది.

○ ● ○

ఆపరేషన్ థియేటర్‌లో ప్రపంచ ప్ర

ఖ్యాతి చెందిన నలుగురు డాక్టర్లు నారాయణ న్ మెదడును పరిశీలిస్తున్నారు. ప్రధాని అభ్యర్థన మేరకు వివిధ దేశాలనుండి వచ్చారు వాళ్లు. డాక్టర్ జయదేవ్ నేతృత్వంలో నారాయణన్ మెదడులో ఒక్కో భాగాన్ని విశితంగా పరిశీలిస్తున్నారు. రక్తనాళాలు, నాడులు, మెదుల్లా అబ్లాంగేటా అన్నిటినీ అణువణువునా దేన్నీ వదలకుండా పరిశీలిస్తున్నారు. మామూలు మనిషి మెదడుకంటే ఏమాత్రం వైవిధ్యం కన్పించినా తాము సఫలీకృతులం అయినట్టే. నిమిషాలు గడుస్తున్నాయి. వాళ్ల నుదుటన చెమటకారుతోంది. అయినా వాళ్లు నిరాశ పడడంలేదు. పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నిస్తూనే వున్నారు. ఆ మేధావి మెదడులో రహస్యాన్ని కనుగొనాలని ఉమ్మడిగా... శక్తికొలదీ ప్రయత్నిస్తున్నారు. నిమిషాలు గంటలయ్యాయి. ఫలితం ఏమీ కనపడలేదు. ఒక మామూలు మనిషి మెదడులో వున్నవే అతడి మెదడులో నూ వున్నాయి. ఆశచావక మళ్లీ ప్రయత్నించారు. మళ్లీ మళ్లీకూడా శోధించారు. చివరకు అలసట ఆవహించింది తప్ప ప్రోగ్రెస్ నిల్... థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి. ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్న మిగతా డాక్టర్లంతా డాక్టర్ జయదేవ్ చుట్టూ చేరారు.

జయదేవ్ నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుని విషయం చెప్పాడు. నారాయణ న్ మెదడులో ఏ రహస్యమూ లేదన్న విషయం వాళ్లను పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ చనిపోయేముందు నారాణన్ ఇచ్చిన కవర్‌లో ఏం వ్రాసి వుందో? తెలుసుకోవాలని అందరికీ ఆత్రుతగా వుంది. వాళ్ల ఆత్రాన్ని పసిగట్టి చిరునవ్వు నవ్వి కోటుజేబులోనుండి కవరుని తీశాడు జయదేవ్.

సమాధానం

"నీ సమాధానాన్ని బట్టే నా ప్రకాశవంతమైన జీవితం ఆధారపడి వుంది. నన్ను పెళ్లిచేసుకోగలవా మిస్ ప్లీజ్"

"చేసుకోలేను"

"చాలా థాంక్స్... ఈ సమాధానాన్నే నేనూ ఎదురుచూస్తున్నాను"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

అందరి చూపులు దానివైపే నిలిచాయి. కవరును తెరిచి అందులో వున్న కాగితాన్ని బయటకు లాగాడు జయదేవ్. తెల్లని కాగితంపై నల్లని అక్షరాలు మెరుస్తున్నాయి. జయదేవ్ చదవడం ప్రారంభించాడు. "మై డియర్ డాక్టర్స్... నా మెదడుని పరిశోధించినా ఫలితం శూన్యం అని నాకు తెలుసు. ప్రతి మనిషి మెదడూ ఒకేలా వుంటుంది. అయితే మెదడు మెదడుకీ తేడా ఎందుకుందని మీరంతా బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. దానికి కారణం ఒకటే. మెదడు కూడా వస్తువులాంటిదే. దాన్ని నిత్యం వాడుతుంటే మెరుస్తుంది. దాన్ని ఉపయోగించకపోతే తుప్పుపట్టిపోతుంది. ఈ విషయం సూక్ష్మ రహస్యం గుర్తించలేక నేటి యువత పెడదారిన పడుతున్నారు. అందుకే నా మాటలుగా వాళ్లందరికీ ఈ విషయం తెలియాలి. యువకులంతా శ్రమిస్తే నిరుద్యోగ సమస్య వుండదు. ఆ యువకులే తమ మేధస్సును వినియోగించుకుని సక్రమ మార్గంలో ఆలోచించగలిగితే వాళ్లలోనే ఎందరో ఐన్‌స్టీన్‌లు... ఎందరెందరో నారాయణన్‌లూ ఆవిర్భవిస్తారు. ఆలోచన అనే మొక్కను పెంచి దానికి నిరంతరం నీళ్లుపోస్తూ వుంటే వీళ్లంతా జాతి గర్వించదగ్గ మహామహులు అవుతారు. జైహింద్.

●

చిత్రం:పురందర్ (జమ్మలమడుగు)